క్లుప్తంగా

23నుంచి క్రికెట్ టోర్నీ

టేకులపల్లి: రానున్న ఉగాది పండుగను పురస్కరించుకుని ఈనెల 23నుంచి మొక్కంపాడు ప్రీమియర్ లీగ్ పేరిట క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కమిటీ బాధ్యులు బి.రెబల్, సీహెచ్ఆర్‌కే దొర, బి.ప్రశాంత్, బి.రవీందర్, బి.ప్రకాశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు రూ.1,500 చెల్లించి జట్టు పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. బోడు పోలీసుస్టేషన్ పక్కన మైదానంలో జరగనున్న టోర్నీలో మొదటి మూడు స్థానాల్లో నిలిచే వారికి నగదు బహుమతులు ఉంటాయని పేర్కొన్నారు. వివరాలకు 9989809857, 9652550425, 97016344284 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

'యువ వికాసం' నిబంధనలు మార్చాలి

టేకులపల్లి: రాజీవ్ యువ వికాస పథకం కోసం దరఖాస్తు చేసుకోవడానికి రేషన్ కార్డు తప్పనిసరి చేయగా, కార్డులు లేక పలువురు అర్హత కోల్పోతున్నారని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో నూతన రేషన్ కార్డులు ఇవ్వలేదని, తద్వారా కొత్తగా వివాహాలు జరిగినవారు యువ వికాసానికి అర్హత కోల్పోయే ప్రమాదముందన్నారు. ఈ మేరకు ప్రభుత్వం నిబంధనలు సవరించాలని డిమాండ్ చేశారు. బానోతు కిషన్‌నాయక్, బానోతు నాగరాజు నాయక్, బోడ శేఖర్ నాయక్ పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పెంచాలి

ఇల్లెందురూరల్: నూతన రేషన్‌కార్డుల జారీలో కొనసాగుతున్న జాప్యం కారణంగా రాజీవ్ యువ వికాసం దరఖాస్తు గడువు పెంచాలని పీవైఎల్ నాయకుడు గుగులోత్ దేవా కోరారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో రేషన్‌కార్డుల మంజూరు లేకపోవడం, వివాహాలు జరిగినా తల్లిదండ్రులతోపాటే రేషన్‌కార్డులలో పిల్లలు కొనసాగారని గుర్తుచేశారు. పాత కార్డులో డిలీట్ అయితేనే కొత్త కార్డులలో చేరుస్తామని గత ప్రభుత్వం చెప్పడంతో కార్డుల నుంచి చాలా మంది డిలీట్ చేయించుకున్నారని పేర్కొన్నారు. కానీ నేటికీ కొత్త కార్డులు మంజూరు లేకపోవడంతో రేషన్ కార్డులలో పేర్లు లేక రాజీవ్ యువ వికాసం కోసం ధరఖాస్తులో చాలా మంది యువకులు అర్హత కోల్పోతున్నారని వాపోయారు. ప్రభుత్వం నూతన రేషన్‌కార్డులు మంజూరు చేసే వరకు దరఖాస్తు గడువు పెంచాలని, సబ్సిడీ కోసం ష్యూరిటీ పెట్టాలన్న నిబంధనలను కూడా తొలగించాలని కోరారు.

జరిమానా రద్దు చేయాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులకు విధిస్తున్న జరిమానాను రద్దు చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకులు, ఆర్జీ–3 ఏరియా కాంట్రాక్టర్లు కోరారు. ఈ మేరకు గురువారం డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, సూర్యనారాయణరావుకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికుడు విధులకు రాకపోతే రూ.350 జరిమానాతో పాటు పరిశుభ్రత లేకపోతే కాంట్రాక్టర్లకు జరిమానా విధిస్తుండడంతో పనులు చేసే పరిస్థితి లేదన్నారు. ఈ మేరకు పరిశీలించాలని కోరగా... డైరెక్టర్లు పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.బ్రహ్మానందం, ఏ. వెంకన్నతో పాటు ఎం.మల్లికార్జున్, ఎన్.సంజీవ్, పి.రమేష్, జి.లింగయ్య, సంపత్, తిరుపతి పాల్గొన్నారు.

విచారణ జరిపించండి..

కొత్తగూడెంఅర్బన్: సింగరేణి ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తున్నారని దీనిపై విచారణ జరిపించాలని హయ్యర్ ఎడ్యుకేషన్, కాలేజీ ఎట్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ యాదగిరి, కమిషనర్ దేవసేనలను హైదరాబాద్‌లో కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట శివశంకర్ గురువారం ఒక ప్రకటనలో కోరారు.

అక్రమ తవ్వకాలు ఆపాలి

జూలూరుపాడు: గుట్టల అక్రమ తవ్వకాలను నిలిపివేయాలని కోరుతూ హ్యూమన్ రైట్ సొసైటీ బహుజన అభ్యుదయ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు తంబర్ల నరసింహారావు గురువారం తహసీల్దార్ స్వాతి బిందును కలిసి వినతిపత్రం అందజేశారు. అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా మట్టితోలకాలు జరుగుతున్నాయని, తగు చర్యలు తీసుకోవాలన్నారు.

తునికాకు మోడెం పనులు ప్రారంభించాలి

ఇల్లెందురూరల్: తునికాకు సేకరణకు గడువు సమీపిస్తున్నందున మోడెం పనులను వెంటనే ప్రారంభించాలని కోరుతూ అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో గురువారం కొమరారం అటవీశాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయ సిబ్బందికి అందజేశారు. బుర్ర వెంకన్న మాట్లాడుతూ.. వేసవిలో గిరిజనులకు రెండో పంట తునికాకు సేకరణపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా చేస్తోందని ఆరోపించారు. 50 ఆకుల కట్టకు రూ.5 చెల్లించాలని, ఇతర పనులపై గతం కంటే 25శాతం పెంచి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆజ్మీర బిచ్చా, శ్రీరాంకోటయ్య, బుర్ర రాఘవులు, ఇస్లావత్ కోటేష్, కూర ముత్తమ్మ పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లు అప్పగించండి..

- అన్నారుపాడులో లబ్ధిదారుల ఎదురుచూపు
- పట్టించుకోని నాయకులు, అధికారులు



అన్నారుపాడులో డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయం

జూలూరుపాడు: అన్నారుపాడు గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిదేళ్ల క్రితం డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించింది. 49 ఇళ్ల కోసం 60 మంది గిరిజనులు దరఖాస్తు చేసుకున్నారు. గ్రామసభలో రెవెన్యూ అధికారులు 32 మందిని అర్హులుగా ఎంపిక చేసి లాటరీ పద్ధతిలో కేటాయించారు. మరో 17 డబుల్ ఇళ్లకు అర్హులైన లబ్ధిదారులు లేకపోవడంతో కేటాయించకుండా వదిలేశారు. దీంతో ఏడేళ్లుగా డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిరుపయోగంగా ఉండటంతో కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. నాలుగు నెలల క్రితం ఖాళీగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం అర్హులను ఎంపిక చేసేందుకు సర్వే నిర్వహించారు. 17 ఇళ్ల కోసం 20 మంది గిరిజనులు దరఖాస్తు చేసుకున్నారు. అన్నారుపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన గ్రామసభలో తహసీల్దార్ 17 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. అయినా నెలలు గడుస్తున్నప్పటికీ ఇళ్లు అప్పగించకపోవడంతో లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సంబంధిత అధికారుల పర్యవేక్షణా లోపం కారణంగా కాంట్రాక్టర్ నాసిరకంగా ఇళ్లు నిర్మించడంతో నివాసయోగ్యంగా లేవు. ఏ కొద్దిపాటి వర్షం వచ్చినా స్లాబ్‌లు కురుస్తున్నాయి. ఇంటి గోడలు పగిలి బీటలు వారగా, ఫ్లోరింగ్ సైతం కుంగిపోయింది. విద్యుత్, తాగునీటి సరఫరా లేకపోవడంతోపాటు అంతర్గత రోడ్లు, డ్రెయినేజీలు లేవు. ఈ కారణాల చేత గతంలో 32 మందికి ఇళ్లు అప్పగించినప్పటికీ కొందరు మాత్రమే నివాసం ఉంటుండగా మిగిలిన ఇళ్లు ఖాళీగానే ఉంటున్నాయి. ఇటీవల జరిగిన ఇందిరమ్మ ఇళ్ల గ్రామసభలో పలువురు లబ్ధిదారులు డబుల్ బెడ్రూం ఇళ్లు మాకొద్దంటూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. 49 డబుల్ బెడ్‌రూం ఇళ్లలో 32 కేటాయించగా మిగిలిన ఖాళీగా ఉన్న 17 ఇళ్ల కోసం అర్హులైన గిరిజన నిరుపేదలకు కేటాయించారు. ఇళ్లను అప్పగించే ముందు మరమ్మతులు, కనీస సౌకర్యాలు కల్పించాలని, కలెక్టర్ స్పందించాలని లబ్ధిదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



పిచ్చి మొక్కలు, ముళ్లపొదలతో ఆవరణ

ముళ్ల పొదలు తొలగించాలి..



డబుల్ బెడ్‌రూం ఇళ్లు అప్పగించాలి. ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న ఇంటిలో తల దాచుకుంటున్నాం. కొన్ని నెలల క్రితం అధికారులు డబుల్ బెడ్‌రూం ఇంటికి లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఇళ్ల చుట్టూ ముళ్ల పొదలు తొలగించి, ఇళ్లు అప్పగించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– బానోత్ మంగ, లబ్ధిదారురాలు, అన్నారుపాడు

మౌలిక వసతులు కల్పించాలి..



డబుల్ బెడ్‌రూం ఇళ్లకు మరమ్మతులు, కనీస సౌకర్యాలు కల్పించాలి. విద్యుత్, తాగునీటి సరఫరా, అంతర్గత రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం ఇంత ఖర్చు చేసి ఇళ్లు నిర్మించి లబ్ధిదారులకు ఇవ్వకపోవడంలో ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదు.

– గుగులోత్ సాములు, లబ్ధిదారుడు, అన్నారుపాడు

లబ్ధిదారులను ఎంపిక చేశాం...



అన్నారుపాడులో 49 డబుల్ బెడ్‌రూం ఇళ్లలో 17 ఇళ్లు ఖాళీగా ఉన్నాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామసభ నిర్వహించి, 17 మంది లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగింది. సమగ్ర నివేదికను కలెక్టర్‌కు అందజేశాం. బెడ్రూం ఇళ్లకు మరమ్మతులు చేపట్టి త్వరలోనే లబ్ధిదారులకు అప్పగిస్తాం.

– కె.స్వాతి బిందు, తహసీల్దార్, జూలూరుపాడు

పోడు పట్టాల కోసం మరో ఉద్యమం

పాల్వంచరూరల్: ఏళ్ల తరబడి పోడు సాగు చేసుకుంటున్న పోడు సాగుదారులు పట్టాలు పొందేందుకు మరో ఉద్యమం చేపట్టాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల విశ్వనాథం అన్నారు. మండల పరిధి బంజర గ్రామపంచాయతీలోని చిరుతానిపాడు గ్రామంలో గురువారం నిర్వహించిన శాఖ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కనీస రహదారి సౌకర్యం కూడా లేని వలస ఆదివాసీ గ్రామాల్లో ఎమ్మెల్యే కూనంనేని సహకారంతో మౌలిక సౌకర్యాలు కల్పించే విధంగా కృషి చేస్తామన్నారు. ప్రతీ గ్రామపంచాయతీలో పార్టీని బలోపేతం చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. నిరుపేదల సమస్యల పరిష్కారం కోసం అండంగా ఉంటామన్నారు. అనంతరం గ్రామశాఖ నూతన కమిటీ కార్యదర్శిగా మాడే చుక్కారావు, సహాయ కార్యదర్శి సురేష్ మరో 11మందితో నూతన కమిటీని నియమించారు. ఈ కార్యక్రమంలో ఉప్పుశెట్టి రాహుల్, ఇట్టి వెంకట్రావ్, నిమ్మల రాంబాబు, వేములపల్లి శ్రీను, కొంగర అప్పారావు, అమృతరావు పాల్గొన్నారు.

మండల లీగల్ సర్వీసెస్ న్యాయవాదిగా ఆనంద్



ఇల్లెందు: ఇల్లెందు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ న్యాయవాదిగా నోటరీ న్యాయవాది దంతాల ఆనంద్‌ను నియమించారు. గురువారం తెలంగాణ ప్రభుత్వం జీఓ ఎంఎస్ 199 ప్రకారం ఆదేశాలు విడుదల చేశారు. పేదలకు ఉచిత న్యాయం అందించేందుకు సలహాలు సూచనలు అందిస్తారు. అంతేగాక ప్రజలకు చట్టాల పట్ల అవగాహన కలిపిస్తారు. రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు.

చలివేంద్రం ప్రారంభం

ఇల్లెందురూరల్: మండలంలోని సుభాష్‌నగర్ కూడలిలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం పంచాయతీ కార్యదర్శి రజినీకాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు కూడలిలో ఈ సౌకర్యం కల్పించామని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాజీ వైస్ ఎంపీపీ మృతికి ఎమ్మెల్యే నివాళి

టేకులపల్లి: టేకులపల్లి-కొత్తగూడెం ప్రధాన రహదారి బోరింగ్ తండా వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మాజీ వైస్ ఎంపీపీ ఉండేటి ప్రసాద్ మృతి చెందిన విషయం విదితమే. ఆయన అంత్యక్రియలు గురువారం సులానగర్‌లో నిర్వహించగా ఎమ్మెల్యే కోరం కనకయ్య, కుటుంబ సభ్యులు పాల్గొని కన్నీటి పర్యంతమయ్యారు. అలాగే, పెద్దసంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు పాల్గొనగా, ఎమ్మెల్యే కనకయ్య పాడే మోసి నివాళులర్పించారు.

ఉద్యోగం నుంచి తొలగించాలి

టేకులపల్లి: గంగారం ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుడు మద్యం సేవించి విధులకు హాజరవడమే కాక బాలికతో అసభ్యంగా ప్రవర్తించినందున ఉద్యోగం నుంయి తొలగించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ, పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి వాంకుడోత్ అజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వారు గ్రామస్తులతో మాట్లాడారు. వార్డెన్‌గా తండ్రి పాత్ర పోషించాల్సిన ఉపాధ్యాయుడు విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించడంతో తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నందున విధుల నుంచి తొలగించాలన్నారు. బానోత్ నరేందర్, ఊకె శ్రావణ్‌తో పాటు రాచకొండ గోపి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

జూలూరుపాడు: బేతాళపాడు గ్రామ పంచాయతీ పంతులు తండాకు చెందిన బానోత్ రాందాస్ పూరిల్లు ఇటీవల ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో కాలిపోయింది. ఈ మేరకు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఆదేశాలతో బాధిత కుటుంబాన్ని గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంగీలాల్ నాయక్, నాయకులు పరామర్శించారు. తక్షణ సాయంగా రేకులు, ఐరన్ పైపులు, ఇతర సామాన్లను అందజేశారు. ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తామని బాధిత కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారు.

భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో ఉద్యమాలు

సింగరేణి(కొత్తగూడెం): స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో యువత ఉద్యమించాలని పీవైఎల్ జిల్లా మాజీ అధ్యక్షుడు బానోత్ ధర్మా, టీయూసీఐ జిల్లా సహాయ కార్యదర్శి పెద్దబోయిన సతీష్ పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ 94వ వర్ధంతి కార్యక్రమాలను పోస్టర్లను గురువారం కొత్తగూడెంలో వారు ఆవిష్కరించి మాట్లాడారు. ప్రస్తుత పాలకులు అనుసరిస్తున్నప్రజావ్యతిరేక విధానాలపై భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ స్ఫూర్తితో పోరాటాలు నిర్వహించాలన్నారు. ఎం.రాజశేఖర్, చంటి, బద్రి, సారన్న, జితేందర్, తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి, స్వాతంత్ర్యం కోసం ఉరికంభం ఎక్కిన భగత్‌సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్ వర్ధంతి కార్యక్రమాలను మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించనున్నట్లు పీవైఎల్ మండల కార్యదర్శి తోటకూరి సతీష్ తెలిపారు. ఈసందర్భంగా టేకులపల్లిలో ఆయన మాట్లాడారు. అన్ని గ్రామాల్లో కాగడాలు, కొవ్వొత్తుల ప్రదర్శనలు, సమావేశాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. నాయకులు కోడెం రవి, భూక్య లక్ష్మణ్, పూనేం సమ్మయ్య, జార్జి పాల్గొన్నారు.



సింగరేణి(కొత్తగూడెం): భగత్‌సింగ్ వర్ధంతి పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందు: భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల విప్లవ పోరాట స్ఫూర్తిని బ్రిటీష్ సామ్రాజ్యవాదంపై దేశ స్వాతంత్ర్యం కోసం నిర్వహించిన వారి పోరాటం, బీజేపీ ప్రభుత్వం సృష్టిస్తున్న మతోన్మాదానికి వ్యతిరేకంగా వాడవాడలా భగత్‌సింగ్ వర్ధంతులను నిర్వహించాలని సీపీఎం నాయకుడు ఏజే రమేష్ కోరారు. గురువారం ఇల్లెందులో ఆయన భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ... 23న భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా భగత్‌సింగ్ లౌకిక సందేశ్ యాత్రను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్‌ఏ నబీ, ఆలేటి కిరణ్, తాళ్లూరి కృష్ణ, మోహన్‌రావు పాల్గొన్నారు.

అధికారమే బీజేపీ లక్ష్యం



ప్రభాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ఇల్లెందు: తెలంగాణలో అధికారమే బీజేపీ లక్ష్యంగా ముందుకు సాగుతోందని ఆ పార్టీ జిల్లా నూతన అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం ఇల్లెందు విచ్చేసిన ఆయనకు బీజేపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. మాట్లాడుతూ.. జిల్లాలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. బలగానీ గోపీకృష్ణ, కె.సంజీవరెడ్డి, సుచిత్ర, మురళీ, రామారావు, సునీత, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులు చేపట్టాలి

చుంచుపల్లి: జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం బస్టాండ్‌కు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో గురువారం బస్టాండ్ ఎదుట ధర్నా నిర్వహించారు. పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు మాట్లాడుతూ... కొత్తగూడెం బస్టాండ్ చాలా పాతకాలం నాటిదని శిథిలావస్థకు చేరుకొని వర్షం వస్తే కురుస్తుందన్నారు. జిల్లా కేంద్రం కావడంతో బస్టాండ్ విస్తీర్ణం కూడా పెంచాలని, ప్రయాణికులు కూర్చోవడానికి బల్లలు కూడా సరిపోవడం లేదన్నారు. బస్టాండ్‌కు నిధులు కేటాయించి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం డిపో మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. వెంకటమ్మ, ఎస్.సంజీవ్, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

కమ్యూనిజం సజీవమైంది..

ఇల్లెందు: దేశంలో పేదలు ఉన్నంతకాలం కమ్యూనిస్టులు వారి వెంట ఉంటారని, ఎన్నటికీ కమ్యూనిజం సజీవంగా ఉంటుందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కె.సారయ్య అన్నారు. గురువారం పట్టణంలోని 22, 23, 24 వార్డు కమిటీల మహాసభలు ఇల్లెందు 24 కమ్యూనిటీ హాల్‌లో జరిగాయి. ఈ సందర్భంగా సారయ్య మాట్లాడారు. ఈ సందర్భంగా మూడు వార్డులను నూతన కార్యదర్శులుగా రామకృష్ణ, కుమ్మరి రవీందర్, చెరుకు సారయ్యలను ఎన్నుకున్నారు.

అందరికీ వర్తింపజేయాలి

జూలూరుపాడు: రాజీవ్ యువ వికాసం పథకాన్ని అందరికీ వర్తింపజేయాలని కోరుతూ సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక తసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. గౌని నాగేశ్వరరావు, వల్లోజి రమేష్, గోపీ, వేణు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ చట్టాలను పటిష్టంగా అమలు చేయండి

పాల్వంచరూరల్: ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని, సీతారామ ప్రాజెక్టు నీటిని జిల్లా వాసులకు అందజేయాలని, జీఓ నంబర్ 3 చట్టం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఈసాల సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల పరిధి లక్ష్మీదేవిపల్లిలో గురువారం జరిగిన పరిషత్ సమావేశంలో మాట్లాడారు. వాగబోయిన చంద్రయ్యదొర, తాటి వెంకటేశ్వర్లు, సోలం రామారావు, పూనెం రమణబాబు, చందా రామకృష్ణ, శ్రీను పాల్గొన్నారు.

నేటి నుంచి 'పది' పరీక్షలు



కొత్తగూడెంఅర్బన్: పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న డీఎస్పీ రెహమాన్



జూలూరుపాడు: మాట్లాడుతున్న ఎంఈఓ జుంకీలాల్

కొత్తగూడెంఅర్బన్: విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాయాలని డీఎస్పీ రెహమాన్ విద్యార్థులకు సూచించారు. లక్ష్మీదేవిపల్లి మండలం హేమచంద్రాపురం ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 35 మంది విద్యార్థులకు ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం పరీక్ష కిట్లలను చీకటి కార్తీక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడారు.

ఇల్లెందురూరల్: పరీక్షల సన్నద్ధతలో కలిగే మానసిక ఒత్తిడిని జయించి ప్రతీ విద్యార్థి సత్ఫలితాలు సాధించాలని ఏటీఓ రమణయ్య, జీసీడీఓ అలివేలు మంగతాయి సూచించారు. రొంపేడు బాలికల ఆశ్రమ పాఠశాలను గురువారం వారు తనిఖీ చేశారు. విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమై మాట్లాడారు. పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతున్నందున తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. విజయవంతంగా పరీక్షలు పూర్తి చేసి మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏటీడీఓ సూర్నపాక రాధ, హెచ్ఎం పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండలంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలలో ఏర్పాటు చేసిన సౌకర్యాలను ఎంఈఓ స్వామి పరిశీలించారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు.

జూలూరుపాడు: ఎస్సెస్సీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నందున అన్ని ఏర్పాట్లు చేశామని ఎంఈఓ బానోత్ జుంకీలాల్ తెలిపారు. మండలంలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రెండు కేంద్రాల్లో 347 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు చెప్పారు.

టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతులు



బహుమతులు అందజేస్తున్న అతిథులు

జూలూరుపాడు: ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి పదోతరగతి టాలెంట్ టెస్ట్‌లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు గురువారం బహుమతులు ప్రదానం చేశారు. స్థానిక ఎక్సలెంట్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో మొదటి స్థానం దక్కిన ఎక్సలెంట్ స్కూల్ విద్యార్థిని గాయత్రి, ద్వితీయ స్థానం పొందిన జూలూరుపాడు హైస్కూల్ విద్యార్థి నిశాంత్, తృతీయ స్థానం పొందిన కేజీబీవీ విద్యార్థిని శృతిలతోపాటు, టాప్ ఫైవ్‌లో నిలిచిన విద్యార్థులకు అతిథులు రిటైర్డ్ సీఐ సీహెచ్ సుబ్బారావు, హైస్కూల్ సీనియర్ ఉపాధ్యాయుడు ఆర్ శ్రీనివాసరావు, సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు బహుమతులు అందజేశారు.

కార్యక్రమంలో ఎక్సలెంట్ స్కూల్ కరస్పాండెంట్ కృష్ణ ప్రసాద్, ప్రిన్సిపాల్ హుస్సేన్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి ఎస్కే చాంద్ పాషా, ఏఐటీయూసీ నాయకులు గుడిమెట్ల సీతయ్య, పసుపులేటి పవన్, వేణు, చింటు, తదితరులు పాల్గొన్నారు.

అందరికీ అందుబాటులో వైద్యం

ఇల్లెందు: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అందరికీ ఉన్నత వైద్యం అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు. ఇల్లెందు ఏరియా ఆస్పత్రిలో మూడు డయాలసిస్ బెడ్లు, ఫిజియోథెరపీ సెంటర్‌తో పాటు వాటర్ కూలర్లను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆస్పత్రిలో ఇప్పటికే డయాలసిస్ బాధితుల కోసం ఆరు బెడ్లు ఉండగా, అదనంగా మరో మూడు బెడ్లు మంజూరు చేయించామని తెలిపారు. అలాగే, రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎక్కడా లేని విధంగా ఫిజియోథెరపీ సేవలు కూడా అందుబాటులోకి వచ్చాయన్నారు. డీఎస్‌హెచ్ఎస్ డాక్టర్ జి.రవిబాబు, సూపరింటెండెంట్ డాక్టర్ హర్షవర్ధన్, వైద్యులు రాంనివాస్, శేఖర్, బన్నీ, డి.ధరణిప్రియ, ఉద్యోగులు పాల్గొన్నారు.



డయాలసిస్ సెంటర్‌లో అదనపు బెడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



దీక్షాశిబిరంలో జర్నలిస్టులతో నాయకులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం గంగా బిషన్‌బస్తీ రైతువేదిక సమీపాన గతంలో కేటాయించిన స్థలాన్ని తమకు అప్పగించి న్యాయమైన సమస్యను పరిష్కరించాలని జర్నలిస్టులు డిమాండ్ చేశారు. పట్టణంలోని జర్నలిస్టులు ఇళ్ల స్థలాల సాధన కార్యాచరణలో భాగంగా కేటాయించిన స్థలం వద్ద గురువారం దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు కనుకుంట్ల కుమార్, యర్రా కామేష్, బాబా, మురళి, జాటోత్ కృష్ణ, పి.సతీష్, వై.గోపాల్‌రావు, బానోత్ ధర్మా, ఎం.రాజశేఖర్, తలుగు అనిల్ తదితరులు దీక్షకు మద్దతు తెలిపారు. మాట్లాడుతూ.. గజం స్థలం రూ.8కే కేటాయించడంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. దీక్షలో జర్నలిస్టులు జునుమాల రమేష్, లోగాని శ్రీనివాస్, కాల్లోజీ శ్రీను, అప్పిడి లక్ష్మణ్, చంద్రశేఖర్, కుమార్, అంతడుపుల రాజశేఖర్, జోగాం తారక్, వట్టికొండ రవి, ప్రవీణ్, గుంటి కృష్ణారావు, రుద్ర రాజశేఖర్, పోలిశెట్టి రాజశేఖర్, వీరూనాయక్, అఫ్జల్ పఠాన్, ఏలూరి శ్రీనివాస్, ఈశ్వర్, పురం శ్రీనివాస్, పిట్టల రమేష్, ఆనంద్, చింతల చిరంజీవి, బీర రవి, ఖాజా, సత్యప్రకాష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి..

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్ట్ సర్వీసు ఇంజనీర్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం సింగరేణి ప్రధాన కార్యాలయంలోని జీఎం పర్సనల్ కవితానాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... సింగరేణిలో వెహికిల్ ట్రాకింగ్ సిస్టమ్ పనిలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ సర్వీస్ ఇంజనీర్లకు తక్షణమే పెండింగ్ వేతనాలు చెల్లించాలని, వారికి ఉపాధి కల్పించాలని సింగరేణిలో 7, 8 సంవత్సరాల నుంచి విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ సర్వీసు ఇంజనీర్లకు గత కాంట్రాక్టర్ ఏడు నెలల నుంచి వేతనాలు చెల్లిచటం లేదని ఆరోపించారు. వేతనాలు రాక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్న సర్వీసు ఇంజనీర్లకు తక్షణమే వేతానాలు చెల్లించాలని రెండు నెలలుగా పనిలేకుండా ఇబ్బంది పడుతున్నన వారికి తక్షణమే మళ్లీ టెండర్లు పిలిచి ఉపాధి కల్పించాలన్నారు. వీరందరూ స్కిల్డ్ వర్కర్స్ అయినందున స్కిల్డ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.



జీఎం పర్సనల్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరాహార దీక్ష



దీక్షలో ఏఐటీయూసీ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని వీకే–7 ఓసీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట గురువారం నిరాహార దీక్ష నిర్వహించారు. అనంతరం డైరెక్టర్(పా) చాంబర్ వద్ద ధర్నా నిర్వహించి డైరెక్టర్‌కు వినతిపత్రం అందించారు. అంతకంటూ ముందు సింగరేణి సెక్యూరిటీ, ఏఐటీయూసీ నాయకులు మధ్య వాగ్వాదం జరిగింది. ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య దీక్షలను ప్రారంభించి మాట్లాడుతూ... సింగరేణిలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ సర్వీసెస్ పోస్టుకు బహిరంగ నియామకానికి వ్యతిరేకంగా తీవ్ర నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. సీఎంఎస్ నియామక నోటిఫికేషన్‌ను తక్షణమే ఉప సంహరించుకోవాలన్నారు. లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. వంగా వెంకట్, వీరస్వామి, వి.మల్లికార్జున్‌రావు, రమణమూర్తి, కే.రాములు, గట్టయ్య, సుదాకర్‌రావు, మధుకృష్ణ పాల్గొన్నారు.